నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
3 | నిజామాబాద్ శుక్రవారం 20 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL

# సర్వే నిర్వహించాలి



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 19 : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ పట్టణంలోని భాగ్యనగర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొబైల్ యాప్‌లో నమోదు చేసిన వివరాలు దరఖాస్తుదారుల వాస్తవ వివరాలతో సరిపోయాయా? లేదా? అన్నది చూడాలని అధికారులకు సూచనలు చేశారు. దరఖాస్తుదారుల స్థితిగతులను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ పూర్తి సమాచారాన్ని సేకరించి మొబైల్ యాప్‌లో పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, తహసీల్దార్ రాజు పాల్గొన్నారు.

# ముక్రా(కే) ఆదర్శం

ఇచ్చోడ, డిసెంబర్ 19 : క్లీన్ అండ్ గ్రీన్ గ్రామంగా ముక్రా(కే) అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నదని కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అన్నారు. ముక్రా(కే)లో నాటి మొక్కలు నేడు వృక్షాలుగా మారాయంటూ నాడు-నేడు ఫొటోలతో ట్వీట్ చేశాడు. ముక్రా(కే) పచ్చదనం, పరిశుభ్రతలో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. గ్రామంలో నాటిన మొక్కలను మూగ జీవుల నుండి రక్షించడానికి వినూత్నంగా లోచించి జాలి చుట్టూ చీరలు కట్టి ప్రతి మొక్కను కాపాడిన మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, గ్రామస్తుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. 2021 జులైలో నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా మారి గ్రామానికి వచ్చే వారికి హరిత పందిరిలా మారి స్వాగతం పలకుతున్నాయని పోస్టు చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కల రక్షణ కోసం ముక్రా(కే)ను ఆదర్శంగా తీసుకోవాలని, ట్విట్టర్ వేదికగా అభినందనలు తెలిపారు.




కేంద్ర మంత్రి చేసిన ట్వీట్




## జామపండ్లు అమ్మి.. నిరసన తెలిపి..

జామ పండ్లు అమ్మి నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు




## ఉదయం పఠనం.. రాత్రి క్యాండిల్ ర్యాలీ..

క్యాండిల్ ర్యాలీ చేస్తూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు

## పది రోజులైన స్పందన కరువు

*కాంగ్రెస్ సర్కారు మొద్దునిద్ర పోతున్నదని, చాలీచాలని వేతనాలతో 20 ఏండ్లుగా ఉద్యోగాలు చేస్తుంటే కనీస స్పందన కూడా లేదని, తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఊరుకునేది లేదని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. వీరు రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపడుతున్న సమ్మె గురువారం నాటికి పదో రోజుకు చేరుకున్నది. నిరసనలో భాగంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు జామ పండ్లు అమ్మి నిరసన తెలిపారు.*

*- నిర్మల్ అర్బన్, డిసెంబర్ 19*

## సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు, ఉపాధ్యాయుల వినూత్న నిరసన

*పది రోజులు నుంచి రోజుకో రీతిలో సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట సమ్మె కొనసాగుతున్నారు. ఇందులో భాగంగానే గురు వారం ఉదయం కలెక్టరేట్ ఎదుట, ఎన్టీఆర్ చౌక్ రహదారిపై పఠనం చేస్తూ నిరసన తెలిపారు. అలాగే రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భ ంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక ఆరోపించారు. దీక్షకు సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్, సీపీఎస్ యూనియన్ రాష్ట్ర నేతలు తిరుమలరెడ్డి చిన్నారెడ్డి, సత్యనారాయణ, పీఆర్‌టీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, దరట్ల జీవన్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్థసార థి కేశవ్, ప్రశాంత్‌రెడ్డి దీప్తి, మల్లిక, నవీన, వెంకటి, దేవదర్శన్, సురేందర్, మంగేశ్ పాల్గొన్నారు.*

*- ఎదులాపురం, డిసెంబర్ 19*

భైంసా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు



# 'అమిత్ షా'పై ఆగ్రహ జ్వాల

- అంబేద్కర్‌ను అవమానించినందుకు క్షమాపణ చెప్పాలి
- దళిత సంఘాల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మలు దహనం

**పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను** కించ పరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాపై గురువారం దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పలు చోట్ల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి పాలాభిషేకం చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మహా ప్రజ్ఞ బుద్ధవిహార్ ఎదుట గల జాతీయ రహదారిపై దళిత సంఘాలు, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ.. బోథ్ నియోజకవర్గంలోని సోనాల మండలంలో అంబేద్కర్ సంఘాలు అమిత్ షా దిష్టిబొమ్మను చేశాయి. నిర్మల్ పట్టణంలో మాల మహానాడు నాయకులు, భైంసా పట్టణంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో గల అంబేద్కర్ విగ్రహం ఎదుట, ముథోల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎస్సీ వర్గీకరణ, అఖిల పక్షం నాయకులు, లోకేశ్వరం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో, పెంబిలో దళిత, ప్రతిపక్ష నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన విగ్రహానికి పాలాభిషేకం చేశారు. **- నమస్తే నెట్‌వర్క్**



ఆదిలాబాద్‌లో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘం నాయకులు

# రుణమాఫీ డబ్బులు రాలే..

- నాలుగో విడుతలో 6,600 మందికి మాఫీ
- బ్యాంకులో జమకాని డబ్బులు

ఆదిలాబాద్, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన రుణమాఫీ కోసం అన్నదాతలు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల్లో భాగంగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. ఇప్పటికే నాలుగు విడుతల్లో ప్రభుత్వం చేపట్టిన రూ.2 లక్షల రుణమాఫీ చేసినట్లు ప్రకటించింది. జిల్లాలో రైతుల రుణమాఫీ అస్తవ్యస్తంగా మారింది. మూడు విడుతల్లో అర్హులైన రైతులకు రుణమాఫీ జరగకపోగా.. నాలుగో విడుతలో చాలా మందికి రద్దు కాలేదు. నాలుగు విడుతల్లో జిల్లాలో రూ.2 లక్షల లోపు బ్యాంకు లోన్ ఉన్న 62,298 మంది రైతులకు రుణమాఫీ జరిగినట్లు అధికారుల నివేదికలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు మొండిచేయి చూపింది.

## రైతుల ఖాతాల్లో జమ కాని డబ్బులు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పండుగ పేరిట 20 రోజుల కిందట నాలుగో విడుత రుణమాఫీ ప్రకటించింది. ఈ విడుతలో జిల్లాలో రూ.2 లక్షల లోపు బ్యాంకు రుణాలు ఉన్న 6,600 మంది రైతులకు రూ.78 కోట్లు మాఫీ అయినట్లు అధికారులు ప్రకటించారు. ప్రభుత్వం మాఫీ చేసిన రుణమాఫీ డబ్బుల కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. బ్యాంకు లోన్ మాఫీ అయితే యాసంగి సాగుకు రుణం తీసుకుందామని రైతులు ఆశించినా వారికి నిరాశ తప్పడం లేదు. 20 రోజులుగా తమ డబ్బులు ఎప్పుడూ వస్తాయా అని ఎదురు చూస్తున్నారు. రోజు బ్యాంకులకు వెళ్లి సిబ్బందిని అడుగుతున్నా, వారు తాము ఏమీ చేయలేమని సమాధానం ఇస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం ఉండడం లేదు. ప్రభుత్వం స్పందించి నాలుగో విడుత రుణమాఫీ డబ్బులు తమ బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని రైతులు కోరుతున్నారు.



# దీర్ఘకాలిక కేసులను పరిష్కరించాలి

**ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం**

ఎదులాపురం, డిసెంబర్ 19 : జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్‌లలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. గురువారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెలలో జిల్లాలోని మూడు కేసులలో నేరస్తులకు జీవితకాల శిక్ష పడడంలో కీలక పాత్ర పోషించిన పీపీలు సంజయ్ వైరాగరి, మేకల మధూకర్‌లను శాలువాతో సత్కరించి బహుమతి ప్రధానం చేశారు. అదేవిధంగా ఈ కేసుల నందు సాక్షులను ప్రవేశపెట్టడంలో ప్రతిభ కనబరిచిన కోర్టు లైసన్ అధికారి గంగాసింగ్, కోర్టు డ్యూటీ అధికారులు జమీర్, రవీందర్‌లను శాలువాతో సత్కరించి నగదు బహుమతి ప్రధానం చేసి అభినందించారు. అనంతరం సీఈఐఆర్ ద్వారా జిల్లావ్యాప్తంగా మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు 28 మొబైల్ ఫోన్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్‌రెడ్డి, నాగేందర్ పాల్గొన్నారు.




నేరస్తులకు జీవితకాల శిక్ష పడడంలో కీలకపాత్ర పోషించిన పీపీ సంజయ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

# ట్రాన్స్‌జెండర్స్ వైద్య సేవలను వినియోగించుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 19 : ట్రాన్స్‌జెండర్స్ మైత్రి క్లీనిక్‌లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. ట్రాన్స్‌జెండర్స్‌కు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతోనే జిల్లాలో మైత్రి క్లీనిక్‌లను ఏర్పాటు చేశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 2వ తేదీన వర్చువల్‌గా ప్రారంభించగా.. జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్స్ ప్రత్యేక క్లీనిక్‌ను అదనపు కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్స్‌పై వివక్ష లేకుండా.. వారు సమాజంలో అన్ని అభివృద్ధి ఫలాలు పొందాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్క ట్రాన్స్‌జెండర్ గుర్తింపు కార్డు పొందాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే హెల్ప్‌లైన్ నంబర్ 155326 ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమారెడ్డి, జిల్లా వైద్యాధికారి రాజేందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ గోపాల్‌సింగ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఆర్ఎంవో సమత, సీడీపీవో నాగమణి, ఏసీడీపీవో నాగలక్ష్మి, సూపర్‌వైజర్ విజయగౌరి పాల్గొన్నారు.



మైత్రి క్లినిక్‌ను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

## పోక్సో కేసులో ఒకరికి జైలు

కుభీర్, డిసెంబర్ 19 ః చాత గ్రామానికి చెందిన ఐనవేని నర్సయ్య అలియాస్ నరేశ్ జూలై 18, 2021లో అదే గ్రామానికి చెందిన మైనర్ బాలిక తన స్నేహితురాలి ఇంటికి వెళ్తుండగా అబ్బు అనే ఆయన ఇంట్లోకి లాక్కెళ్లి లైంగికదాడికి యత్నించాడు. దీంతో అమ్మాయి కేకలు వేయడంతో అబ్బు అబ్బు వచ్చాడు. దీంతో ఆ అమ్మాయి తన ఇంటికి పరుగులు పెట్టింది. జరిగిన ఘటనను తన తండ్రికి వివరించగా.. ఆయన కుభీర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఏఎస్సై ఉమేశ్ నర్సయ్యపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ జరిపారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి నేరస్తుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాడు. నేరస్తుడితోపాటు విచారణ నివేదికను కోర్టుకు సమర్పించారు. నిర్మల్ కోర్టులో పీపీ విశ్వాస్‌రెడ్డి సాక్షులను ప్రవేశపెట్టగా వారి సాక్ష్యంతో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఏ.కర్ణకుమార్ నిందితుడికి నాలుగేండ్ల కారాగార శిక్షతోపాటు రూ.1000 జరిమాన విధిస్తూ తీర్పును వెలువరించారని కోర్టు అధికారి తెలిపారు.



మన్నూర్ జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఈవో ప్రణీత

# టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

**ఆదిలాబాద్ డీఈవో ప్రణీత**

గుడిహత్నూర్, డిసెంబర్ 19 : పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో ప్రణీత అన్నారు. గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం, సాయంత్రం తప్పకుండా చదవాలని, టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ సుజాత్‌ఖాన్, హెచ్ఎం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలకు ప్రణాళిక

**డీఐఈవో జాదవ్ పరశురాం**

కుభీర్, డిసెంబర్ 19 ః విద్యార్థులు 90 రోజుల ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి (డీఐఈవో) జాదవ్ పరశురాం సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. అంతకు ముందు విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. క్లాస్ రూంలకు వెళ్లి విద్యార్థుల నోట్స్‌ను పరిశీలించారు. హాజరు శాతాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ప్రిన్సిపాల్ సునీల్‌కు సూచించారు.

## నూతన డైట్ చార్జీల ప్రకారమే భోజనం అందించాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 19 : ప్రభుత్వ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు నూతన డైట్ చార్జీల ప్రకారమే భోజనం అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తేకఠిన చర్యలుంటాయన్నారు. మండల ప్రత్యేకాధికారు లు వసతి గృహాలను సందర్శించాలన్నారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కు మార్, డీఈవో రామారావు, సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

# ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి




ఆదిలాబాద్ కలెక్టరేట్‌ఎదుట 48 గంటల నిరసన కార్యక్రమంలో ఏఎన్ఎంలు

**కలెక్టరేట్ల ఎదుట 48 గంటల నిరసన**

ఎదులాపురం, డిసెంబర్ 19 : వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ప్రతిపాదికన విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని తెలంగాణ వైద్య, ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ నవీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట 48 గంటల నిరసన చేపట్టారు. తొలి రోజైన గురువారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్, ఉపాధ్యక్షుడు చిన్నన్న మద్దతు తెలిపారు. ప్రభుత్వం వెంటనే కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరంలోనే సహపంక్తి భోజనాలు చేశారు. చలిలోనే తమ ఆందోళన కొనసాగించారు. దీక్షా శిబిరంలోనే రాత్రి నిద్రించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పుష్పల, ఆనందబాయి, పద్మ, తులసి, లలిత, మనీలత, ప్రియదర్శిని, అనురాధ, అహల్య, లక్ష్మి, కరుణ పాల్గొన్నారు.

## నిర్మల్ కలెక్టరేట్ ఎదుట..

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 19 ః కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ వైద్య ఉద్యోగుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం 48 గంటల నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నిర్మల్ కలెక్టరేట్ ఎదుట..